సమయపాలన పాటించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 5 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు సమయపాలన పాటించాలని సీడీపీవో ఉమారాణి అన్నారు. ఈ మేరకు బుధవారం సిరిసిల్ల మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలతో స్థానిక అంగన్‌వాడీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ, సెక్టార్ పరిధిలోని ఆయాలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల్ని శ్రద్ధతో చూసుకోవాలన్నారు. గర్భిణీ, బాలింతలకు రుచికరంగా వంట చేసి, పెట్టాలన్నారు. పిల్లలకు గుడ్, టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉద్యోగోన్నతుల విషయంలో ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. సకీ హెల్ప్ లైన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం, సూపర్‌వైజర్లు దివ్య, సుస్మిత, తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధికజైస్వాల్

సిరిసిల్ల టౌన్, మార్చి 5 : మహిళల రక్షణకు న్యాయ వ్యవస్థలో ఉన్న చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం సిరిసిల్లలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు చట్టంలో గల హక్కులను వివరించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, ఆడెపు వేణు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

బోయినపల్లి, (వేములవాడ) మార్చి 5 : మండలంలోని కోరెం ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సంపత్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బాలింతలకు, చిన్నారులకు జరుగుతున్న టీకాల పంపిణీ, రికార్డుల పనితీరును ఆయన పరిశీలించారు. చిన్నారుల తల్లిదండ్రులకు కూడా సరియైన సమయంలో వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఏఎన్ఎం శ్యామల, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

చికిత్స పొందుతూ సీనియర్ న్యాయవాది మృతి

ఆనంద్ కుమార్ (ఫైల్)

వేములవాడ, మార్చి 5 : వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది చెర్ల ఆనంద్ కుమార్ (60) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఫిబ్రవరి 16న ఎదురుగట్ల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, హైదరాబాద్ కిమ్స్ దవాఖానకు తరలించారు. ఇటీవల మెరుగైన వైద్యసేవల కోసం గాంధీ దవాఖానకు తరలించగా, బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. భార్య అమృత సింగిల్ విండో డైరెక్టర్‌గా కొనసాగుతుండగా, కూతురు, కొడుకు కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్, కాతుబండ నర్సింగారావు, గడ్డం సత్యనారాయణరెడ్డి, అభిలాశ్, వంగల కర్ణ సంతాపం వ్యక్తం చేసి , వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

వేములవాడ, మార్చి 5 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల నిరసిస్తూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను తొలగించి, కార్పొరేట్ రంగాలకు వత్తాసు పలికిందని ఆరోపించారు. కార్మికుల ఉపాధిపై పొట్ట కొడుతూ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. మార్చి 28న పార్లమెంట్ వద్ద చేపట్టనున్న నిరసనలో భాగంగా చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికుల తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, జిల్లా నాయకులు దేవరాజు, కుమ్మరి లక్ష్మణ్, విక్రమ్, కనుకయ్య, లింగం తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు

రుద్రంగి, మార్చి 5: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 కోట్ల 50 లక్షల నిధులను బుధవారం మంజూరు చేయడంతో మార్కెట్ కమిటీ చెర్మన్ చెలుకల తిరుపతి, నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చెర్మన్ చెలుకల తిరుపతి మాట్లాడుతూ, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని రుద్రంగి మండలాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరువ తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, డీఐజీ, జిల్లా ఎస్పీ సహకారంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో పీఆర్ఆర్ నిధులు మంజూరు అయ్యాయన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈఎంఆర్ఎస్ బొప్పాపూర్ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 5 : ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం కింద బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం దుమాలలోని ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించినట్లు ఎంఈవో కృష్ణహరి తెలిపారు. అక్కడున్న తరగతి గదులు, లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్, మ్యూజిక్, ఆర్ట్, కంప్యూటర్, జిమ్, ఆటస్థలం, డైనింగ్‌ను పరిశీలించారు. ఇక్కడ ఎచ్ఎం మధుమాలతి ఉన్నారు.

గడువులోగా సీఎమ్మార్ అప్పగించాలి

జగిత్యాల, మార్చి 5: జిల్లాలోని రైస్ మిల్లర్లు గడువులోగా సీఎమ్మార్ బకాయిలు అప్పగించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని రైస్‌మిల్లుల యజమానులతో సీఎమ్మార్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ, ఈనెల 17వ తేదీలోగా సీఎంఆర్ బకాయిలు అప్పగించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పౌరసరఫరాల క్షేత్ర స్థాయి సిబ్బంది రోజు వారీ లక్ష్యం మేరకు వారి పరిధిలోని మిల్లుల నుంచి సీఎమ్మార్ అప్పగించేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని, ఎఫ్‌సీఐ అధికారులు సీఎమ్మార్ గోదాముల్లో అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎమ్మార్ దిగుమతి చేయడానికి హమాలీలను సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన

రాయికల్, మార్చి 5: మండలంలోని ఇటిక్యాల గ్రామ శివారులో గల నివేదిత కృష్ణారావు వృద్ధాశ్రమాన్ని బుధవారం సాయంత్రం మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కాసేపు ముచ్చటించి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్లలోని స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ఎస్ రజిత

సిరిసిల్ల టౌన్, మార్చి 5 : స్కానింగ్ సెంటర్ల నిర్వహణలో వైద్య, ఆరోగ్యశాఖ సూచించిన నిబంధనలను ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో ఎస్ రజిత హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సిరిసిల్లలోని స్కానింగ్ సెంటర్‌లో ఆమె తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఫార్మ్ ఆఫ్ ఆడిట్స్, స్కానింగ్ సెంటర్ సర్టిఫికెట్లు, స్కానింగ్ పరికరాలు, తదితర రికార్డులను పరిశీలించారు. స్కానింగ్ పరీక్షలు చేసే వైద్యులు, రేడియోలజిస్ట్ పేర్లు సర్టిఫికెట్లలో నమోదు చేసుకోవాలని సూచించారు. పీసీపీఎన్‌డీటీ(యాక్ట్)చట్టం ప్రకారం.. నిబంధనలు అనుసరించి, ఆసుపత్రులు నిర్వహించాలని, రిజిస్ట్రేషన్ లేని ప్రైవేట్ ఆసుపత్రులను, స్కానింగ్ సెంటర్లను చట్ట ప్రకారం.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీవోఎం హెచ్ఎన్ ఇన్‌చార్జి సంపత్‌కుమార్, హెచ్ఈ బాలయ్య, డీఈవో మహేశ్ తదితరులు ఉన్నారు.

పద్మశాలీ సంఘం బలోపేతానికి కృషి చేయాలి

పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ

సిరిసిల్ల టౌన్, మార్చి 5 : పద్మశాలీ సంఘం ఎన్నికల్లో భాగంగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పద్మశాలీలు భారీ సంఖ్యలో పాల్గొని సంఘం బలోపేతానికి కృషి చేయాలని పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సిరిసిల్లలోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీ సంఘం, యువజన సంఘం, మహిళా సంఘం ఎన్నికల నిర్వహణ కోసం ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఆయా సంఘాల ఎన్నికలకు ముందు సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిలో బాగంగా ఈ నెల 8 నుంచి 26 తేదీ వరకు సభ్యత్వాల నమోదు జరుగుతుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 13న పద్మశాలీ సంఘం, మే 4న యువజన సంఘం, మే 18న పద్మశాలీ మహిళా సంఘం ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. అన్ని వర్గాల పద్మశాలీయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాముని వనిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ

బాధిత కుటుంబానికి పరామర్శ..

ముస్తాబాద్, మార్చి 5: మండలంలోని బంధనకల్ గ్రామానికి చెందిన నక్క రాకేశ్ తండ్రి నక్క శంకరయ్య ఇల్లంతకుంట మండలం అనంతరం గ్రామ శివారులో టిప్పర్-బైక్ యాక్సిడెంట్లో మంగళవా రం మృతి చెందారు. కాగా, బుధవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ రామచంద్రరెడ్డితో పాటు మండల పార్టీ నాయకులు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ధర్మపురి రూరల్, మార్చి 5: ధర్మపురి మండలం గాదెపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాదెపల్లిలో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో తుమ్మెనాల గ్రామానికి చెందిన అప్పాల మల్లయ్య (55) అక్కడికక్కడే మృతి చెందాడు. దోనూర్ గ్రామానికి చెందిన కస్తూరి లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలు కాగా, దవాఖానకు తరలించారు.

మల్లాపూర్ పీహెచ్‌సీ తనిఖీ

మల్లాపూర్, మార్చి 5: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. దవాఖానలో రికార్డులు, మందులు, ల్యాబ్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల వైద్యాధికారి వాహిని, ఉమాదేవి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దుకు కార్యాచరణ ప్రకటిస్తాం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి

పింగళి శ్రీపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

వేములవాడ, మార్చి 5 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సీపీఎస్ విధానం రద్దు అయ్యే వరకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం ఆయన ఆలయ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సీపీఎస్ విధానం రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, నేటి వరకు ఎలాంటి ఉలుకు పలుకు లేదని విమర్శించారు. సీపీఎస్ విధానం రద్దు చేసే వరకు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు తదితర వాటిని వెంటనే విడుదల చేయాలని కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన మొదటిసారి వేములవాడకు రాగా ఆయనకు పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం పక్షాన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు చిప్ప యాదగిరి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మాడిశెట్టి మహేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనందరావు, కిరణ్ కుమార్, శ్రీనివాస చారి, రమేశ్, రాంప్రభు, మధుకర్, సాంబరెడ్డి, హన్మాండ్లు, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

విహారయాత్రలో ముస్తాబాద్ బీటెక్ విద్యార్థి దుర్మరణం

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముస్తాబాద్, ఫిబ్రవరి 5 : యువకుడి విహారయాత్ర విషాదయాత్రగా మారి తల్లిదండ్రులకు కడుపుకోతగా మిగిల్చింది. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ముత్యాల దేవేందర్-శ్యామల దంపతుల ఏకైన పుత్రుడు సాయిచరణ్ (22) హైదరాబాద్‌లోని మల్లారెడ్డి క్యాంపస్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సోమవారం కేరళ రాష్ట్రం పున్నమడలో హౌస్‌బోట్ నుంచి పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజులు క్రితం విహారయాత్రలో భాగంగా ఎనిమిది మంది సహచర బీ-టెక్ విద్యార్థులతో కలిసి సాయిచరణ్ అలప్పుజ చేరుకున్నాడు. సంతోషంగా మిత్రులతో కలిసి పున్నమడ జెట్టీ తూర్పు వైపున ఆపి ఉంచిన హౌస్ బోట్ నుంచి గట్టులో పడిన సాయిచరణ్‌ను గమనించని మిత్రులు కొద్దిసేపటికి సాయిచరణ్ లేడని స్నేహితులు గమనించారు. స్థానికులకు విషయం తెలుపడంతో అక్కడి అగ్నిమాపక దళం స్కూబా బృందం సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చేసి, మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. సహచర విద్యార్థులను అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. మృతుడి శవం పోస్టుమార్టం అనంతరం బుధవారం స్వగ్రామం ముస్తాబాద్‌కు చేరుకుంది. అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన ముస్తాబాద్ మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

బాలిక మృతికి కారణమైన వ్యక్తికి జైలు

పెగడపల్లి, మార్చి 5: బాలికను వేధించి, మృతికి కారకుడైన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల ఫోక్సో కోర్టు న్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పు ఇచ్చారు. పెగడపల్లి ఎస్ఐ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజారాంపల్లికి చెందిన ఓ బాలికను ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఎట్టెం రవి ప్రేమ పేరుతో వేధించాడు. వేధింపులు తాళలేక ఆ బాలిక 2022లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బాలిక తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ ఘటనపై సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ వాటిని ఫోక్సో కోర్టు న్యాయమూర్తి నీలిమ ముందు ప్రవేశపెట్టారు. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందుతుడు రవికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ సాగర్‌ను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, సీఐ రవి, ఎస్ఐ రవికిరణ్ అభినందించారు.

రేషన్ దరఖాస్తులు నో ఎంట్రీ

- మీసేవలో కనిపించని రెండు గ్రామాలు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అధికారులు
- పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న గ్రామస్తులు

కోనరావుపేట, మార్చి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ విషయంలో ఇదుగో వచ్చే అదుగో వచ్చే అంటూ చెప్పి దరఖాస్తుదారులను ఆగం పెట్టిస్తోంది. ఏడాదిగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నిరాశ తప్పడం లేదు. పజాపాలన దరఖాస్తులు తీసుకొని ఏడాది గడిచినా రేషన్ కార్డుల జారీ విషయంలో పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రజాపాలన దరఖాస్తులకు ముందు రేషన్ కార్డు దరఖాస్తు చేసుకున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ క్రమం లో రేషన్ కార్డు దారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తున్నప్పటికీ మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించగా, పలు గ్రామాలకు చెంది న లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఊరుపేరు చూపించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో రేషన్ కార్డు వస్తుందో లేదో అని ఆయోమయంలో ఉన్నారు.


కోనరావుపేట మీసేవలో రేషన్‌కార్డు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్న నిర్వాహకులు

మీసేవలో రెండు గ్రామాలకు నో ఎంట్రీ..

మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా, మామిడిపల్లి, రామన్నపేట గ్రామాలు ఆన్‌లైన్ చూపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అన్ని గ్రామాల్లో ఉన్న రేషన్ డీలర్ల షాపు నంబర్లతో పాటు గ్రామాలు చూపిం చడంతో దరఖాస్తు దారులు సులవుగా దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ, మామిడిపల్లి, రామన్నపేటతో పాటు నూతనంగా పంచాయతీలుగా ఏర్పడిన తండా లు మీసేవలోని రేషన్ కార్డు సైటులో చూపించడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన దరఖాస్తు దారులు నూతనంగా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవాలన్న, రేషన్‌కార్డులో ఉండి అందులో కు టుంబ సభ్యులను నమోదు చేయాలన్న అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో రెండు గ్రామాలకు చెందిన దరఖాస్తు దారులు తహసీల్దార్ కార్యాలయం, మీసేవ చుట్టూ ప్రదక్షిణలు చేసిన లాభం లేకుండా పోయింది. ఆన్‌లైన్ ఊరు కనబడకపోతే మాకు సంబంధం లేదంటూ తహసీల్దార్ చెపుతున్నాడు. అలాగే మీ సేవకు వెళ్తే ప్రభుత్వం రెండు గ్రామాలను ఆన్‌లైన్‌లో చూపించడం లేదన నిర్వహకులు చెపుతున్నారు. ఈ క్రమంలో రేషన్ కార్డు దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి రేషన్‌కార్డు దరఖాస్తుదారుల సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కారించేలా కృషి చేయాలని కోరుతున్నారు.



మీ సేవలోని రేషన్ కార్డు సైట్

గంభీరావుపేట: పరీక్ష కేంద్రం వద్ద తమ రూమ్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు షురూ..

వేములవాడ, మార్చి 5 : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం వేములవాడ పట్టణంలో ప్రశాంతంగా మొదటిరోజు ముగిశాయి. ఉదయం ఎనిమిది గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాత పరీక్ష గదులకు విద్యార్థులను అనుమతించారు. వేములవాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వివేకానంద, సుమిత్ర కళాశాలలో విద్యార్థులకు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయగా, మొ త్తం 805 మంది విద్యార్థులకు గాను 46 మంది గైర్‌హాజర్ కాగా , 759 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్‌గా ఆర్ శేఖర్, డీఈవోగా శంకరయ్య, వివేకానంద కళాశాలలో సీఎస్‌గా సత్యనారాయణ, డీఈవోగా చంద్రమౌళి, సుమిత్ర కళాశాలలో సీఎస్‌గా లత, డీవోగా కృష్ణ వ్యవహరించారు.

రుద్రంగి, మార్చి 5 : మండల కేంద్రంలోని కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ క ళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాం తంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరంలో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 127 మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట, మార్చి 5 : ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాచర్ల జూనియర్ కళాశాలలో 386 మంది విద్యార్థులకు 377 మంది హాజరయ్యారు. 9 మంది గైరాజరయ్యారు.

ఇల్లంతకుంట, మార్చి 5 : మండల కేంద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని చీఫ్ సూపరిండెంట్ మల్లారెడ్డి అన్నారు. కళాశాలలో మొదటి సంవత్సం విద్యార్థులు 259 మంది విద్యార్థులు ఉండగా 250 మంది పరీక్షలు రాశారని, 9 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు.

గంభీరావుపేట, మార్చి 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 331 మంది విద్యార్థులకు గాను 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 132 మంది గైర్హాజరు

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా పలు కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. మొదటి రోజు 132 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. జనరల్ 3551, ఒకేషనల్ 513, మొత్తం కలిపి 4064 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. జనరల్‌లో 3,470, ఒకేషనల్‌లో 462 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ 81, ఒకేషనల్ 51 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

నేడు చలో వేములవాడ

కలెక్టరేట్, మార్చి 5 : నేడు 6వ తేదీ గురువారం జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులు అందరూ కలిసి వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇంటి ముందు చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, పంచాయతీ అధికారి శేషాద్రిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద గణేశ్ మాట్లాడుతూ పంచాయతీలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు గత నాలుగైదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 6వ తేదీ గురువారం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇంటి ముందు ధర్నా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఉదయం 8.00 గంటల వరకే వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీగా తరలివెళ్లి ఆది శ్రీనివాస్ ఇంటి ముందు ధర్నా చేస్తామన్నారు. అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, గ్రామ పంచాయతీ కార్మికులు పూర్తిగా విధులు బంద్ చేసి, చెన్నమనేని రమేశ్‌బాబు గెస్ట్‌హౌస్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, మండలాధ్యక్షుడు వర్కోలు మల్లయ్య, శ్రీనివాస్ గౌడ్, అక్కల అంజాగౌడ్, లోకిని శ్రీనివాస్, సందెల మహేశ్, కంసాని రవీందర్ పాల్గొన్నారు.

మూగజీవాల దాహాన్ని తీరుస్తున్న మేడి సురేశ్

నీటి తొట్టిలో నీరునింపుతున్న సురేశ్

ముస్తాబాద్, మార్చి 5 : పక్షులు, పశువులు అడవి ప్రాంతంలో ఉండే మూగ జీవాలకు నీటి తొట్టిల్లో నీళ్లు పడుతూ గూడెం గ్రామానికి చెందిన ప్రేరణ స్వేచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సమాజీ సేవ కార్యకర్త మేడి సురేశ్ తనవంతు సహకారాన్ని అందిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం, నామాపూర్, రామ్‌రెడ్డి పల్లె, చిప్పలపల్లి, గ్రామాల మధ్యలో నీటి తొట్టెలను ఏర్పాటు చేసి, ఏటా వేసవి కాలంలో మూగజీవులకు నీరును అందిస్తున్నారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టి మూగ జీవుల దాహాన్ని తీరుస్తున్న సురేశ్‌ను పలువురు అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 5 : వెంకటాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాల పాలైన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. రాగట్లపల్లికి చెందిన చెరుకు బాలమల్లు బైక్‌పై మందాటి దేవయ్యను కూర్చో బెట్టుకుని సిరిసిల్ల నుంచి తమ వ్యక్తిగత పనులు ముగించుకుని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వెంకటాపూర్ కామారెడ్డి-కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో బాలమల్లు తలకు తీవ్రగాయాలు కాగా, 108లో చికిత్స కోసం సిరిసిల్లకు తరలించారు. దేవయ్యకు సైతం స్వల్పగాయాలయ్యాయి.

'ఆరోపణలు మానుకోవాలి'

మల్లాపూర్, మార్చి 5: చిట్టాపూర్ సహకార సంఘ పాలకవర్గంపై ఆరోపణలు మానుకోవాలని సంఘం చైర్మన్ నేరేళ్ల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. చిట్టాపూర్‌లోని సహకార సంఘ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలకవర్గం హయాంలో ఎలాంటి అవినీతి జరగలేదని, కొందరు కావాలని రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. తమ పాలకవర్గ సభ్యులపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★ ఇంటి స్థలం యాదగిరిగుట్టకి 1 కి.మీ., వరంగల్ హైవేకి 3 కి.మీ., రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి అతి దగ్గరలో రెసిడెన్షియల్ ప్లాట్లు అమ్మబడును. B.T. Road Face... ఈరోజే ఇల్లు/కాటేజ్/గెస్ట్‌హౌస్ కట్టుకోవచ్చు. LRS కలదు. Cont: 6300765739.
NT-329217

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189